

# మహా మానవవాది ఎమ్.ఎన్.రాయ్

## – నరిసెట్టి ఇన్నయ్య



(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)


-10-

## చైనా విప్లవంలో ఎమ్.ఎన్.రాయ్ పాత్ర



రోజా లగ్జెంబర్గ్

ఎమ్.ఎన్.రాయ్ తన భార్య ఎవిలిన్ ను అర్ధాంతరంగా అమెరికా వెళ్ళిపొమ్మని, కారణం ఏం చెప్పకుండా ఆమె అడిగినా సమాధానం ఇవ్వకుండా వింతగా ప్రవర్తించాడు. గత్యంతరం లేక ఎవిలిన్ అయిష్టంగానే అమెరికా వెళ్ళిపోయింది. రాయ్ రష్యాలో వుంటూ తన పనులు చూసి పెట్టటానికి లూసీ గైస్లర్ ను నియమించుకున్నాడు. ఆమె జర్మన్ కమ్యూనిస్టు. రోజా లగ్జెంబర్గ్ పెంపొందించిన కమ్యూనిస్టు ఉద్యమంలో ఆమె పనిచేసింది. అయితే 1919లో రోజా లగ్జెంబర్గ్ ను జర్మనీలో చంపేసిన తర్వాత ఈమె ఉద్యమంలో కొనసాగుతూ రాయ్ సన్నిహితురాలయింది. లోగడ ఎవిలిన్ చేసిన పనులన్నీ రోజా చేపట్టి కార్యదర్శివలె పనిచేసింది. రష్యా రాజకీయాల్లో స్టాలిన్ కు సన్నిహితుడుగా అగ్రస్థాయి నాయకుడుగా ఉన్న ఎమ్.ఎన్.రాయ్ కొత్త పాత్రను నిర్వహించవలసి వచ్చింది. ఆయన చైనా వెళ్ళి అక్కడ జరుగుతున్న పోరాటాలలో కమ్యూనిస్టు పార్టీకి తోడ్పడవలసిందిగా సోవియట్ నాయకత్వం కోరింది. అప్పటికే రాయ్ చైనా విషయంలో చాలా అధ్యయనం చేశారు. అది దృష్టిలో పెట్టుకుని రాయ్ కు కొత్త బాధ్యతలు అప్పగించారు. రాయ్ తన బృందంతో చైనా వెళ్ళేసరికి అప్పటికే బరోడిన్ అక్కడ వున్నాడు. లోగడ బరోడిన్ మెక్సికోలో రాయ్ ను కలిపినప్పటి నుంచి వారు సన్నిహిత మిత్రులుగా వున్నారు. చైనాలో వారిరువురు అవలంబించిన ధోరణి భిన్నరీతులలో సాగింది.



బరోడిన్

1920 నాటికే చైనాలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి పనిచేస్తున్నది. సన్ ఎట్ సన్ కొమిన్ టాంగ్ ఆధ్వర్యాన 1924లో కమ్యూనిస్టుల సహకారంతో ప్రభుత్వాన్ని ఏర్పరిచారు. అది జాతీయ ప్రభుత్వం. లోగడ భారత దేశ విప్లవానికి సహాయపడమని ఎమ్.ఎన్.రాయ్ సన్ ఎట్ సన్ ను కలిశారు. అప్పుడు నరేంద్రనాథ్ పేరుతో కలిశారు. ఆ పరిస్థితులు వేరు. ప్రస్తుతం రాయ్ చైనా వెళ్ళేసరికి 1925లోనే సన్ ఎట్ సన్ మరణించాడు. ఆయన స్థానంలో నాయకుడుగా ప్రభుత్వ అధికారాన్ని వాంగ్ చిన్ వై చేపట్టాడు. కమ్యూనిస్టుల సహకారం వారికి వున్నది.

రాయ్ వెళ్ళి వచ్చేసరికి బరోడిన్ ఒక ధోరణిలో ఉద్యమానికి సహకరిస్తున్నాడు. జాతీయ బూర్జువా వర్గంతో సహకరిస్తూ సామ్రాజ్య వాదంపై పోరాడాలని చైనా కమ్యూనిస్టులు భావించారు. రష్యా ప్రభుత్వం కూడా ఇందుకు మద్దతు తెలిపింది. ఈ నేపథ్యంలో 1926లో చాంగ్ కై షేక్ ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకున్నాడు. అంతేగాక ఉత్తరాది దండయాత్ర కూడా ప్రారంభించాడు. కమ్యూనిస్టులు దీనిని బలపరిచారు. గాలెన్ అనే రష్యా సైనిక సలహాదారు ఈ పథకాన్ని సమర్థించాడు. రైతులు, కార్మికులు ఇందులో బాగా చేరిపోయారు. దండయాత్ర ముందుకు సాగింది. షాంగైలో ప్రవేశించిన దండయాత్రలో కార్మికులపై దారుణ హింసలు చేశారు. కార్మిక

సంఘాలు రద్దు చేశారు.

ఇదంతా అవకాశవాదమని రాయ్ ఖండించారు. గ్రామాలలో కమ్యూనిస్టులు బలపడి గ్రామ పాలనలు అధీనం చేసుకుని పార్టీ నిలదొక్కుకున్న తరవాత ఉత్తరాది యాత్ర సాగించాలని రాయ్ కోరాడు. రాయ్ పక్షానికి, బరోడిన్ పక్షానికి వ్యతిరేకత ఏర్పడింది. కార్మికులు, కర్షకులు బలపడిన తర్వాత దండయాత్ర సాగించాలని, ఇంతవరకు ఉద్యమాన్ని లోతుపాతులతో బలపరచాలని రాయ్ కోరాడు. ఈ విషయంలో బరోడిన్ కు రాయ్ కు తేడా వచ్చింది. దీనిని క్షుణ్ణంగా పరిశీలించమని 1926 నవంబర్ లో అత్యవరసర సమావేశం ఏర్పాటు చేశారు.




1926లో చాంగ్ కై షేక్ ప్రభుత్వాన్ని వశం చేసుకోగా అప్పటివరకూ పెత్తనం చెలాయిస్తున్న వాంగ్ చిన్ వై దేశం వదిలి వెళ్ళిపోయాడు. ఉత్తరాది యాత్ర సాగుతుండగా కమ్యూనిస్టులు అదే అదనుగా విప్లవాన్ని విస్తరింపచేయవచ్చునని బలపరిచారు. ఊహాన్ నగరాలు ఆక్రమించుకున్నారు. విప్లవ ప్రభుత్వం అక్కడ కేంద్రాన్ని ఏర్పరచింది. అదంతా కమ్యూనిస్టు విజయంగా చెప్పుకున్నా గ్రామస్థాయిలో పట్టు ఏర్పరచటంలో కమ్యూనిస్టులు విఫలమయ్యారు. షాంగ్ కై షేక్ కార్మికులను దారుణంగా అణిచివేశాడు. కార్మిక సంఘాలు రద్దు చెయ్యమన్నాడు. విప్లవానికి వ్యతిరేకంగా చియాంగ్ సాగిపోతున్న అతన్ని వ్యతిరేకిస్తే జాతీయవాదులు సహకరించరని బరోడిన్ వర్గం భావించింది.

ఎమ్.ఎన్.రాయ్ ఈ విషయంలో విప్లవం ఎలా తప్పుదోవన పడుతున్నదీ హెచ్చరిస్తూ పోయాడు. రష్యానుండి వచ్చిన ఇరు ప్రతినిధి వర్గాల తీవ్రమైన అభిప్రాయ బేధం రావడం వలన 1926 నవంబర్ లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అప్పట్లో యువ నాయకుడుగా వున్న మావో సెటుంగ్ కూడా ఆ సమావేశానికి వచ్చారు. ఆయన రాయ్ ని చూడటం అదే మొదలు. కానీ వారు ఎక్కువగా చర్చలు చేసుకునే అవకాశం కలగలేదు. హాంకౌలో కమ్యూనిస్టు పార్టీ కార్యవర్గాన్ని రాయ్ ఏర్పాటు చేశాడు. రైతు, కార్మిక సంఘాలు బలపడి ఉద్యమాన్ని లోతుగా తీసికెళ్లాలని గ్రామస్థాయిలో పెత్తనం చేజిక్కుంచుకోవాలని కోరాడు. రాయ్ కోరిన మేరకు తీర్మానాలు చేశారు. బరోడిన్ ఈ విషయంలో రాయ్ ని వ్యతిరేకిస్తూ అలా చేస్తే వామపక్షం వారికి కమ్యూనిస్టులకు సహకారం ఉండదని వాదించాడు.

రాయ్ సర్వాధికారాలతో రష్యానుండి వచ్చినా ఆర్థికపరమైన కీలకమంతా బరోడిన్ చేతిలో వుండటం వలన కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. అదీగాక బరోడిన్ నాలుగేళ్ళ నుండే చైనాలో వుండటం వలన అందరితో పరిచయాలు పెరిగి ఆయన చెప్పినట్లు వినసాగారు. రాయ్ విబేధించిన తర్వాత చైనాలో వాంగ్ చిన్ వై రష్యానుండి కచ్చితమైన హామీ కోరాడు. ఆమేరకు రాయ్ రష్యాతో సంప్రదించి ఒక టెలిగ్రాం పంపించమని కోరాడు. మాస్కో నుండి సందేశం స్వయంగా చూస్తే తాను రాయ్ చెప్పినట్లు వింటానన్నాడు. వాంగ్ కోరిన ప్రకారం మాస్కో నుండి వచ్చిన టెలిగ్రాంను రాయ్ అతనికి చూపించాడు. వెంటనే ఆ సందేశాన్ని వాంగ్ తన అనుచరులకు కూడా అందజేశాడు. కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా వున్న వారికి రష్యా సందేశం మంచి ఆయుధం అయింది. కమ్యూనిస్టులను చైనా ద్రోహులంటూ కొమిన్ టాంగ్ నుండి బహిష్కరించారు. రష్యా నుండి వచ్చిన సలహాదారులను వెంటనే వెళ్ళిపొమ్మన్నారు. ఆ దశలో తిరోగమనానికి సిద్ధం కావాలని బరోడిన్ ఇచ్చిన సలహాలు కమ్యూనిస్టు పార్టీ పాటించింది. అయితే రాయ్ అప్పట్లో బరోడిన్ ఏర్పాటు చేసిన సమావేశానికి వెళ్ళటానికి నిరాకరించాడు. మరొకవైపు కమ్యూనిస్టులను దారుణంగా హింసించాడు, నిర్దుష్టమైన విప్లవమార్గం చేపట్టాలని రాయ్ చేసిన సూచనలు నిరాకరించటంతో చైనా కమ్యూనిస్టులు తీవ్రంగా నష్టపోయారు. ఈ విషయంలో రాయ్ తప్పు చేశాడని కానీ ఆయన నిర్ణయాలు వక్రమార్గాన పడ్డాయని కానీ సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ఎన్నడూ అధికారికంగా అనలేదు. కానీ కమ్యూనిస్టులకు చైనాలో తాత్కాలికంగా ఎదురు దెబ్బ తగిలింది. చైనాలో ఎదుర్కొంటున్న ప్రమాదపరిస్థితుల దృష్ట్యా రాయ్ ప్రతినిధి వర్గం, బరోడిన్ ప్రతినిధి వర్గం రష్యా వెళ్ళిపోవలసి వచ్చింది. తిరిగి వెళ్ళేటప్పుడు రాయ్ వర్గం చాలా ఇబ్బందులకు గురయ్యారు. గోబీ ఎడారిలో ఒకసారి చిక్కుకు పోగా కార్లు కదలకుండా నిలిచిపోగా, హఠాత్తుగా, అకాలంగా వర్షం పడింది. అందువలన ఇసుకలో చిక్కుకున్న కార్లు మళ్ళీ ప్రయాణం చెయ్యగలిగాయి. మొత్తం మీద ప్రతినిధి వర్గం సురక్షితంగా మాస్కో చేరింది.




చైనాలో జరిగిన విషయాలూ పూర్వాపరాలూ అన్నీ లోతుపాతులతో రాయ్ సుదీర్ఘంగా రాశాడు. ది చైనీస్ రివల్యూషన్ అనే రాయ్ రచన నిర్దుష్టమైన ఆధారాలతో రష్యన్ భాషలో వెలువడింది. రష్యన్ స్టేట్ పబ్లిషింగ్ డిపార్ట్ మెంట్ దీన్ని వెలువరించింది. ఈ గ్రంథానికి కావలసిన విషయ సేకరణ అంతా రాయ్ నాటి రష్యా ప్రభుత్వానికి అందజేశారు. అయితే ఇతర భాషలలో దీనిని ప్రచురించరాదని సోవియట్ ప్రభుత్వం ఏ కారణాలు చేతనో ఆంక్షలు విధించింది. ఇప్పుడు ఆ గ్రంథం బయట పెట్టవలసిన బాధ్యత రష్యా ప్రభుత్వానిది. అప్పుడు చైనాలో రాయ్ పాత్ర ఇంకా సమగ్రంగా బయటపడుతుంది. చైనాలో రాయ్ చేసిన పనుల గురించి రాబర్ట్ సి. నార్త్ మరొక ప్రొఫెసర్ తో కలిసి పరిశోధన చేసి వెలువరించారు. అది లభిస్తున్నది.

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS